క్లుప్తంగా

చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి



వడలిలో చేనేత కార్మికులతో అల్లాడ సూర్య భాస్కర్

పెనుగొండ: కష్టాల్లో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవడానికి రాష్ట్రంలో రైతు బజార్ తరహాలో చేనేత బజార్లు ఏర్పాటు చేయాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం వడలిలో జాతీయ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేనేత కార్మికుల ఇంటింటికీ తిరిగి వారి కష్టాలను అడిగి తెలుసుకొన్నారు. కార్మికులకు కనీసం రోజుకు రూ.200 సైతం రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో వారి కుటుంబాలు గడవడమే కష్టంగా ఉందన్నారు. పనికి ఆహార పథకంలో చేనేతను చేర్చి ఆదుకోవాలన్నారు. చేనేత బజార్లు ఏర్పాటు చేయడం వలన వారు నేసిన వస్త్రాలను చేనేత బజార్లలో అమ్మకాలు సాగిస్తారన్నారు. కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు కొక్కిరాల గణేష్‌కుమార్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వైట్ల కిషోర్‌కు పరామర్శ



వైట్ల కిషోర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ తల్లి ఆచంట సొసైటీ అధ్యక్షురాలు వైట్ల శారదా దేవి గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు బుధవారం ఆచంటలో కిషోర్‌ను పరామర్శించిన రంగనాథరాజు శారదాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పెనుమంత్ర ఎంపీపీ కేఎన్‌వీ నారాయణ రెడ్డి(వాసు), కోట వెంకటేశ్వరరావు, నెక్కంటి రామలింగేశ్వరరావు, తప్పెట్ల విజయకుమార్, పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద జిల్లా పరిషత్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ సౌజన్యంతో చలివేంద్రం ప్రారంభించారు. బుధవారం ఆలయం పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డాక్టర్ జయభారతరెడ్డి, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావులు ప్రారంభించారు. మొదటి రోజు రత్నాతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కావలి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చినగోపురం చైర్మన్ గాదె వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు రేలంగి నరసింహారావు, కెల్లా పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించిన ఎస్సై

'సాక్షి కథనానికి స్పందన'



సిర్రావారిపేటలో దారి సమస్యను పరిశీలిస్తున్న ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ సిర్రావారిపేటకు చెందిన గ్రామ వలంటీర్ సిర్రా రవితేజ ఇంటికి వెళ్లే దారి సమస్యను బుధవారం ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ పరిష్కరించారు. సాక్షిలో మంగళవారం 'ఇంటికి దారి ఇప్పించాలని వినతి' శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువురు కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి సమస్యను సానుకూలంగా పరిష్కరించారు. సిర్రా సుబ్బారావు కుమారులకు మురుగునీరు వెళ్లే ప్రదేశం సిర్రా చంద్రరావు కుమారుడు ఇచ్చేలా, దానికి బదులుగా సిర్రా చంద్రరావు కుమారుడికి సుబ్బారావు కుమారులు దారి ఇచ్చేలా సర్దుబాటు చేసి ఇరు వర్గాలకు రాజీ కుదిర్చారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డి, వీఆర్వో ఆకుల వెంకన్న ఉన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పొడగట్లపల్లికి చెందిన భూపతిరాజు రామకేశవ బంగార్రాజు– సత్యవతి దంపతులు బుధవారం అమ్మవారికి 16 గ్రాముల బంగారం, 1.50 కిలోల వెండిని సమర్పించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోడల్ మున్సిపాలిటీగా నరసాపురం

- ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి



శ్మశానవాటిక వద్ద విద్యుత్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు అవసరమన ప్రణాళిక రూపొందించి ముందుకు వెళుతున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 14వవార్డులో ఉన్న ప్రధాన హిందూ శ్మశాన వాటిక వద్ద రూ.68 లక్షలతో చేపట్టనున్న వాచ్‌మెన్ షెల్టర్ బిల్డింగ్, అపర కర్మల భవనం, టాయిలెట్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కొత్తగా అభివృద్ధిచేస్తున్న శ్మశానవాటికలో విద్యుత్‌తో దహన సంస్కారాలు చేసే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికను అందంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యుత్‌తో దహన సంస్కారాలు చేసే విధంగా అభివృద్ధి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో దహన సంస్కారాలు జరిగేలా శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అలాగే పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు రూ 207 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్ తీసుకువచ్చామన్నారు. మొదటి విడతగా రూ 18 కోట్లతో 1 నుంచి 9 వరకూ వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు మొదలు పెట్టనున్నామని చెప్పారు. రూ.61 కోట్లతో మంచినీటి పైప్‌లైన్స్ ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న డంపింగ్‌యార్డ్ నిర్మాణం కూడా త్వరలో చేపడతామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కార్పొరేట్ తరహాలో బస్టాండ్‌ను అభివృద్ధి చేశామన్నారు. రూ.100 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, 100 పడకల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేసుకోగలిగామని చెప్పారు. చేపట్టిన అభివృద్ధి పనులు వేంగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, నాయకులు కాగిత సత్యవాణి, పాలపర్తి బోస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వెస్ట్ పంచాయతీ కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం లక్ష్మీదేవి కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి భజన కాలక్షేపం నిర్వహించారు. పరిసరగ్రామాలనుండీ పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో చివరిరోజు శుక్రవారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మొగల్తూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఊర్మిళ

మొగల్తూరు: బాల్య వివాహలు చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని సీడీపీఓ బి.ఊర్మిళ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్రాహ్మణులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో వివాహాలపై అవగాహన లేనివారు, లేదా మంచి సంబంధం వచ్చిందని అంగీకరించే వారు ఉంటారని, అటువంటి వారు మిమ్మల్ని సంప్రదిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జి.అనితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: బాల్య వివాహాలు చేసినా, అందుకు ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని నరసాపురం తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు శుక్రవారం నరసాపుం తహసీల్దార్ కార్యాలయంలో పాస్టర్లతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు చేయకూడదని, అలా చేసిన పాస్టర్స్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సమావేశంలో రెవరెండ్ ఎం.విజయకుమార్, ఈదా జాషువా, గుమ్మాపు శ్యామ్‌జోసెఫ్, బి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి



జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌తో ఎస్టీ సెల్ అధ్యక్షుడు కావాడి శివకుమార్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తాడేపల్లిగూడేనికి చెందిన కావాడి శివకుమార్ బుధవారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. 2024లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ప్రమాణం స్వీకారం చేయడానికి షెడ్యూల్ తెగలకు చెందిన ఓటర్లను, యువజనులను ప్రభావితం చేసి, దీక్షతో వైసీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు రాజకీయంగా గుర్తింపు తీసుకువచ్చారన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. 40 రోజుల పాటు 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు. చిన్న పిల్లలకు పుస్తకాలు చదివించడం, కథలు నేర్పించడం, అలాగే స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణ, డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. సెలవుల్లో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

పాలకొల్లులో..

పాలకొల్లుసెంట్రల్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11 వరకూ విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ శాఖాధికారిణి వి. శాంతకుమారి బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక మారుతి సెంటర్ వద్ద లక్ష్మీ పిల్లల ఆసుపత్రి పక్కన ఉన్న శాఖా గ్రంథాలయంలో ఈ శిక్షణా తరగతులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. శిక్షణ తరగతులు ముగింపు అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు, శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన



నరసాపురంలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ, ఏటీయూసీ నాయకులు



పెనుగొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైయివేటీకరించాలని ప్రయత్నించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుందని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు విమర్శించారు. విశాఖ ఉక్కు రక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నెక్కంటి సుబ్బారావు, కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణరావు, నెక్కంటి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేసే ఆలోచనను మానుకోవాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఆందోళనలో భాగంగా బుధవారం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, వీరా పాండు రంగారావు, కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా 811 రోజులుగా స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా పెనుగొండలో బుధవారం సీపీఎం వామపక్షాల పిలుపు మేరకు సిఐటీయూ ఆధ్వర్యంలో మిల్లు కార్మికులు, సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ విశాఖ ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న వారిపై నిర్బంధం ప్రయోగించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, రైతు సంఘ నాయకులు గుర్రాల సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు శీలం ఏసు, నీలాపు ఆదినారాయణ, మల్లుల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనారాయణుని బ్రహ్మోత్సవాలు



అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీ చతుర్భుజ లక్ష్మీ తాయార్లు సమేత శ్రీ అష్టభుజ లక్ష్మీ నారాయణ స్వామివారి (చినగోపురం) బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచిప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు పాటు 13వ తేది వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పీటీ గోవిందరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు విశాఖ జిల్లా పెందుర్తి వాస్తవ్యులు, కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకులు ముప్పిరాల అనంతాచార్యస్వామి, వారి శిష్య బృందంచే విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగరుణం, మృత్సంగ్రహణము, అంకురార్పణ, కుంబావాహన, నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. శనివారం ఉదయం అలంకార తిరుమంజనం, రాత్రి చంద్ర వాహనసేవ తిరువీధి ఉత్సవం, ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి శేషవాహనసేవ, సోమవారం రాత్రి హనుమంత వాహనసేవ, మంగళవారం రాత్రి గరుడ వాహన సేవ, అనంతరం పటికబెల్లంతో శ్రీకృష్ణ తులాభారం, బుధవారం ఉదయం శ్రీవారికి పూలంగి సేవ, రాత్రి ఎదురు సన్నాహ మహోత్సవం, అనంతరం శ్రీవారి తిరు కల్యాణం, గురువారం ఉదయం శ్రీవారికి చందనోత్సవం, రాత్రి రథోత్సవం, శుక్రవారం ఉదయం వసంతోత్సవం అనంతరం ధ్రువమూర్తుల తిరుమంజనం, మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, రాత్రి ప్రణయ కలహము (ఏడు ముసుగుల ఉత్సవం), దివ్య మంగళ దర్శనం, శనివారం ఉదయం సుదర్శన మహాయజ్ఞం, మధ్యాహ్నం తిరుప్పావడై ఉత్సవం, రాత్రి పండిత సత్కారం అనంతరం శ్రీ పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామ పూజలు జరుగుతాయన్నారు.

పరదేశయ్య స్వామి ఆరాధన ఉత్సవాల ప్రారంభం

పాలకొల్లు అర్బన్: మండలంలోని భగ్గేశ్వరంలో ఉన్న శ్రీ పరదేశయ్య స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వీరభద్ర భజన సమాజం, దగ్గులూరు ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. గురుస్వామి వీరా భసవేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు జాతర ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి



ఇలపర్రులో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షురాలు పద్మావతి

పెనుగొండ: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో వ్యవసాయ కూలీలకు ఉపాధి కలగడంతో పాటు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. బుధవారం ఇలపర్రులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా కాలువలు, పంట బోదేలు పూడిక తీత పనులను ప్రారంభించారు. వ్యవసాయ కార్మికులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పడపట్ల పద్మ నాగేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు వేంద్ర వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ, కుసుమే సత్యనారాయణ పాల్గొన్నారు.

అద్దేపల్లి కళాశాలలో అధునాతన సౌకర్యాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలోనే అత్యాధునిక సౌకర్యాలతో అనుభవం ఉన్న అధ్యాపకులతో మంచి విద్యాబోధనలు అందిస్తున్న కళాశాల అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అని ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థి దశలోనే ఉపాధి సౌలభ్యం కూడా అందుతుందన్నారు. కళాశాలలో ఐదో సెమిస్టర్ పూర్తిచేసిన విద్యార్థులు 238 మంది ఇంటర్న్ షిప్‌కు వెళ్లగా 178 మంది విద్యార్థులకు ఉపాధి లభించిందన్నారు. ఇంటర్న్‌షిప్‌లో ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు చొప్పున అందజేశారన్నారు. కళాశాల ఇప్పటికే రెండు పర్యాయాలు నాక్‌కు ఎంపికైందని అన్నారు. ఈ సంవత్సరం నాక్ ఎంపికకు వెళ్లిందన్నారు. అంతేకాకుండా కళాశాల అటానమస్‌కు ఎంపిక కావడం వల్ల యూనివర్సిటీ నుంచి అనుమతులు కోసం ఎదురుచూసే అవకాశం లేకుండా విద్యార్థులకు అవసరమైన గ్రూపును ఎంపిక చేసుకోవడానికి కళాశాలకు స్వయంప్రతిపత్తి ఉంటుందన్నారు. ప్రస్తుతం కళాశాలలో బిఎస్సీ కి సంబంధిచి ఎంపీసీ, ఎంసీసీఎస్, ఎంసీసీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, హెచ్‌బీసీ, ఏటీజెడ్‌సీ, బీఏకి సంబంధించి ఈపీసీఏ, హెచ్‌ఈఏఫ్‌టీ, హెచ్‌ఈపీ, బీకామ్‌కు సంబంధించి జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ (డిజిటల్ మార్కెటింగ్), పీజీకి సంబందించిన గ్రూపులు ఎంకామ్, ఎంఎస్సీ (ఆక్వాకల్చర్), ఎంఎస్సీ (బోటనీ), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. లైబ్రేరీలో డిజిటల్ లైబ్రరీ, ఎన్‌లిస్ట్ జర్నలిజం, ఎల్ఎంఎస్ (లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం) సౌకర్యాలు ఉన్నాయన్నారు. అలాగే త్వరలో కళాశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరిండెంట్ పతంజలి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు నరికివేతపై ఫిర్యాదు

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న కొబ్బరిచెట్టును ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.బాల త్రిపుర సుందరి నరికివేయించారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ కుడక ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు కంబాల తిరుమల వెంకటేశ్వరరావుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు తోట సుబ్బారావు, వాస్కూరి సూర్యనారాయణ, వాస్కూరి లక్ష్మీ నారాయణ తదితరులు తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు. పంచాయతీకి చెందిన ఈ చెట్టు పంచాయతీ వేలం పాటలో ఉందన్నారు. ఈ చెట్టు నరుకుతున్నట్లు తెలిసి మీమంతా వెళ్లి నరకవద్దని కోరినా హెచ్ఎం వినకుండా ఏకపక్ష నిర్ణయంతో కొబ్బరిచెట్టు నరికి వేయించారని వారు ఆరోపించారు. పంచాయతీ, తహసీల్దార్ అనుమతి లేకుండా చెట్టు నరికించిన ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



భీమవరంలో ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యార్థులు ఫిటినెస్ కోసం తప్పనిసరిగా క్రీడలను అలవర్చుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం జగపతిరాజు అన్నారు. జిల్లా బ్యాడ్మింట అసోసియేషన్, ఎస్ఆర్‌కేఆర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా బుధవారం విజేతలకు బహుమతులు అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానంలో విద్యార్థులు ఫిట్‌నెస్ కోసం క్రీడలు, యోగ వంటి వాటికి కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన బ్లాక్ పాంథర్ టీం కెప్టెన్ బి మణికంఠ, టీమ్ సభ్యులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి హరికృష్ణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సిహెచ్ హరిమోహన్, జి సారిక, వి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి



భీమవరంలో ఈకేవైసీ నమోదు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవివర్మ

సాక్షి, భీమవరం: పింఛన్‌దారులు విధిగా తమ సీఎంఎఫ్ఎస్ ఐడీలను అధార్ లింక్ చేసిన మొబైల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవాలని భీమవరం ఉప ఖజానాధికారి ఎ.రవివర్మ అన్నారు. బుధవారం భీమవరంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటుచేసిన ఈకేవైసీ నమోదుపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదిన పాలకొడేరు, 9న వీరవాసరం మండల పరిషత్ కార్యాలయాల్లో పెన్షన్‌దారులకు ఈకేవైసీ నమోదుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇతర సందేహాలు నివృత్తి చేసుకోడానికి సెల్:99122 43377,63026 18446 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించాలని రవివర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజీసీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జీవీ సత్యనారాయణరాజు, కార్యదర్శి సుబ్బారావు, ఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో చదవాలి

ఆకివీడు: అవగాహనతో చదవడం, ఇష్టంతో చదవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.శ్రీకర్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్రకేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, రెండో సంవత్సరం ఉత్తీర్ణత కాని విద్యార్థులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మం పాల్గొన్నారు.